ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
గురువారం | 29 జనవరి, 2026 | పేజీలు :08

## నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ



ప్రజాపక్షం/హుజురాబాద్: ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటీని, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బంధీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 30వ తేది వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. కలెక్టర్ వెంట హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

### కార్పోరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ప్రజాపక్షం/కరీంనగర్: కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను గౌరవించుకుని సముచిత స్థానం కల్పిస్తుందని... పార్టీ నాయకత్వం, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేసి కార్పోరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ మున్సిపల్ ఎన్నికల పరిశీలకుడు తమ్మల నాగేశ్వరరావు అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీదర్ బాబు, పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజన్ కుమార్, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తల క్రుషి ఎనలేనిదని అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, ఎవరికైనా బి ఫామ్ ఇవ్వలేకపోతే వారికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. కార్పోరేషన్ లో 66 డివిజన్ లు ఉండగా ఆశావహుల నుంచి దాదాపు 350 దరఖాస్తులు వచ్చాయని, అందులో గెలుపు అవకాశాలున్న వారిని అధిష్టానం ఎంపిక చేస్తుందని అన్నారు. పార్టీ అధిష్టానం నిలబెట్టిన వారి గెలుపు కోసం అందరు కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో గ్రామాల వలె పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతున్నామన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఎంపికకు 66 సీట్ల లో సర్వే జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడికెల్లినా ప్రజా పాలన పై ప్రజలు పాజిటివ్ గా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఆర్టీసీకి 9 వేల కోట్లు చెల్లించిందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు పంపిణీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణ మాఫీ,ఉద్యోగాల నియామకాలు , సన్న వడ్లు బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, నియోజకవర్గనికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు వంటి పథకాలు అమలు చేస్తుందన్నారు. పదేళ్ల అధికారం లేని సమయంలో పార్టీ కోసం నిర్వీరామంగా క్రుషి చేశామని తెలిపారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్ ఇవ్వవద్దని మంత్రుల ముందు తమ ఆవేదనను వెల్లడించారు.

### సంపూర్ణత అభియాన్ 2.0

## పురోగతి సాధించాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : సంపూర్ణత అభియాన్ 2.0 లోని అంశాలపై పురోగతి సాధించాలని నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. బుధవారం న్యూఢిల్లీలోని నీతి ఆయోగ్ ప్రధాన కార్యాలయం నుండి దేశంలోని 112 జిల్లాలు, 513 బ్లాక్‌లలో ఈ కార్యక్రమాన్ని ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుండి ఏప్రిల్ 14 వరకు విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ రంగాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ 2.0 లో భాగంగా తిర్యాణి బ్లాక్ పరిధిలో అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపడతామని తెలిపారు. ఇప్పటికే జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశామని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ, జిల్లా సమన్వయకర్త బాలరాజు పాల్గొన్నారు.




### నిజాయితీగా, నిష్పక్షపాతంగా

## విధులు నిర్వర్తించాలి: ఇన్‌చార్జి కలెక్టర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : మున్సిపల్ ఎన్నికలలో అధికారులు విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల విధులపై జోనల్ ఆఫీసర్స్, ఎఫ్ ఎస్టీ, ఎస్ ఎస్టీ టీంలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలోజిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికీ సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహిం చాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదని స్పష్టం చేశారు.పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, వీడియో రికార్డు చేయడం చాలా కీలకమని, ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. వీటికి సంబంధించిన అన్ని వివరాలతో సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని సూచించారు. నగదు సీజ్ చేసే సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, నోడల్ అధికారులు గీత, శ్రీనివాసాచారి, నవీన్, ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్, జమ్మికుంటలలో ఎన్నికల కేంద్రాలను తనిఖీ



ప్రజాపక్షం/కరీంనగర్: హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో త్వరలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గారు నేడు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు మరియు కౌంటింగ్ కేంద్రాలను ఆయన వ్యక్తిగతంగా పరిశీలించారు. హుజురాబాద్, జమ్మికుంట పురపాలక సంఘ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట డిగ్రీ మరియు పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయబోయే కౌంటింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను సిపి గారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని, బందోబస్తు విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సూచించారు. ఈ పర్యటనలో సిపితో పాటు ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి



ప్రజాపక్షం/కరీంనగర్: వచ్చే నెల 17 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## గోయల్‌వాడ జాతర ప్రారంభం

ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడ సమీపాన గోదావరినది ఒడ్డున శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి భక్తులు తమ కుటుంబసభ్యులతో కలిసి వాహనాల్లో జాతర ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. గోదావరినదిలో పుణ్యస్నానాలు చేశారు. సమీపాన విడిది ఏర్పాటు చేసుకుని వంటవార్పు చేపట్టారు. పూజారులు అమ్మవార్లకు పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. సాయంత్రం సమీప కంకవనం నుంచి సారాలమ్మను కోయ పూజారులు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా గద్దె వద్దకు చేర్చారు. అనంతరం భక్తులు సారాలమ్మను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అమ్మవార్లను దర్శనం చేసుకొని పూజలు చేశారు. జాతర ఏర్పాట్ల గురించి కమిటి చైర్మన్ గీట్ల శంకర్‌రెడ్డి, ఈ.వో. రాజ్‌కుమార్‌లతోపాటు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, తగిన భద్రత కల్పించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

## ఈత చెట్లను తొలగించిన వారిపై కలెక్టర్ ఫిర్యాదు



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామంలో గీత కార్మికులకు జీవన ఆధారమైన ఈత చెట్లను నిర్లక్షంగా తొలగించి కక్షపూరితంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు బోడపట్ల సతీష్ బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ కు ఫిర్యాదు చేశారు. సుమారు 8 సంవత్సరాల క్రితం దమ్మాయిగూడెం గ్రామ గౌడ సంఘం సభ్యులు తమ జీవన ఉపాధి కొరకు గ్రామంలోని చెరువు కట్టపై వందల సంఖ్యలో ఈత మొక్కలను నాటక నిర్లక్ష్యంగా గ్రామ కాంగ్రెస్ నాయకుడు ఉన్నాం రాజశేఖర్ సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి రమేష్ జెసిబి సహాయంతో ఈత చెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని తొలగించిన ఈత చెట్ల స్థానంలో కొత్త మొక్కలను గ్రామపంచాయతీ నిధులతో నాటించాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కలిసిన వారిలో ఖమ్మం గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శరత్, తోడేటి దుర్గాప్రసాద్ గౌడ్, కుక్కల నాగేశ్వరరావు గౌడ్, తిరుమలాయపాలెం మండలం గౌడ సంఘం అధ్యక్షుడు బోడపట్ల సతీష్, మల్లం సతీష్, గౌడ్, గౌని ఉదయ్ గౌడ్, బోడపాట్ల నాగేశ్వరావు గౌడ్, బోడబట్ల బద్రి గౌడ్, ఖమ్మం జిల్లా వైరాధ్యక్షురాలు వట్టికూటి ఉమాదేవి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## చొప్పదండి మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగురవేస్తాం



ప్రజాపక్షం/చొప్పదండి: అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలోని ఏకైక మున్సిపాలిటీ చొప్పదండిపై గులాబీ జెండాను ఎగురవేస్తామని స్థానిక మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చొప్పదండి పట్టణంలో పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు బత్తిని సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాగంగా బిఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో చొప్పదండి మున్సిపల్‌లో కార్యకర్తలు సమన్వయంతో ఏకతాటిగా కలిసిపోయి 14 వార్డులలో అభ్యర్థుల గెలుపును లక్ష్యంగా చేసుకుని వారిని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త తీసుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగబాలుతో కలిసి పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలే అభ్యర్థుల గెలుపుబాటను నిర్ణయిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, రేవెల్లి సర్పంచ్ బందారపు అజయ్ కుమార్, ఈపనపల్లి సాంబయ్య, మాజీ మార్కెట్ చైర్మన్లు ఆరెల్ల చంద్రశేఖర్, ఎండి జమీర్, నాయకులు మాడూరపు మహేష్, పోరండ్ల నితీష్, పెద్దెల్లి అనిల్, నరేష్ రావణ్ తదితరులున్నారు.

## శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రజాపక్షం/శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ గుట్టపైవెలసియున్న శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడే శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి కళ్యాణం భూదేవి నీలాదేవిలతో ఆలయ పండితులు శేషం మురళీధర్ ఆచార్యులు, మాధవాచార్యులు, రామకృష్ణ చార్యుల ఆధ్వర్యంలో కళ్యాణం జరిపించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొరెం రాజిరెడ్డి, ఆలయ ఈవో సుధాకర్ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాగా ఫిబ్రవరి 1వ తేది ఆదివారం రోజున పౌర్ణమి జాతర జరుగుతుందని,2వ తేది సోమవారం నాకబలి పుష్పయాగం కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.భక్తుల సౌకర్యార్థం చలువ పందిర్లు, మంచినీటి వసతులు,టాయిలెట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**ఆలయ చరిత్ర:** హిందూ పురాణాల ప్రకారం శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో మొదటిదైన మత్స్య అవతారం అని తెలంగాణలో ఉన్న ఏకైక మత్స్యగిరీంద్ర స్వామి ఆలయము ఇది.బ్రహ్మ దేవుని వద్ద నుండి సోమకాసురుడు అనే రాక్షసుడు చతుర్వేదాలను తస్కరించి మహాసముద్రంలో దాక్కుంటాడు.అప్పుడు శ్రీ మహావిష్ణువు మత్స్య అవతారంలో సోమకాసురుని వెతికి పట్టుకొని సంహరించి చతుర్వేదాలను తిరిగి బ్రహ్మదేవునికి అప్పగిస్తాడు.అప్పుడు శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి భూదేవి నీలాదేవిల తమేత స్వయంభు వెలసినాడు.కొత్తగట్టు గుట్టపై 11వ శతాబ్దంలో కాకతీయ రాజులు ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది.అప్పటి నుండి గు ట్టపై మత్స్యగిరీంద్ర స్వామి పూజలు అందుకుంటున్నాడు.

**గుట్టపై కోనేరులో పవిత్ర స్నానాలు:** గుట్టపై మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి మత్స్యగిరీంద్ర స్వామిని దర్శించుకుంటే పాపాలు హరించి కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.స్వామి వారి ఆలయ ఆవరణంలో ఆంజనేయస్వామి,శివాలయం,ఉపాలయాలుకూడా ఉన్నాయి.

## తల్లి బైలెల్లినాదే.. గద్దెపైకి సారలమ్మ

ప్రజాపక్షం/చొప్పదండి: డప్పు చప్పుళ్ల ..శివసత్తుల పూనకాలు.. కోయపూజారుల మంత్రోచ్చరణలు.. వెల్లివిరిసిన భక్తి పారవశ్యం నడుమ ఆ తల్లి వనం నుంచి జనంలోకి బయలుదేరింది. సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం చొప్పదండి మండల కేంద్రంతో పాటు గుమ్లాపూర్, రాగంపేట, ఆర్నకొండ గ్రామాల్లో సారలమ్మ గద్దెనెక్కడంతో జాతర ప్రారంభమయ్యింది. మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం కోయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలను కుంకుమ భరిణె రూపంలో గిడబండల నుంచి తీసుకుని కాలినడకన డప్పుచప్పుళ్లతో శివసత్తుల పూనకాల మధ్య అంగరంగ వైభవంగా సారలమ్మ గద్దె చేరుకుంది. సారలమ్మని తీసుకువస్తున్న క్రమంలో దారి పొడవునా భక్తులు నీరాజనం పలికారు. జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకుంటున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్లు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కాంగ్రెస్‌నీ ఆశీర్వదించండి

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ లోని 9వ డివిజన్ కోతిరాంపూర్ లో పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రారంభించారు. బీఆర్ఎస్ మహిళా నాయకులు కాశిదాసు రేణుక, తిరుమల తో పాటు పలువురు వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ రావు మాట్లాడుతూ, రాబోయే ఎనిమిది సంవత్సరాల పాటు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ఇందుకోసం కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. తొమ్మిదో డివిజన్ ను అత్యుత్తమ డివిజన్ గా తీర్చిదిద్దుతామని రాజేంద్ర రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య మాజీ కార్పొరేటర్ ఆకుల నరసన్న నాయకులు అనంతుల రమేష్, శ్యాంసుందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు డివిజన్ ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానేరు క్యాట్ 2016 పోటీ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరణ

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: ఫిబ్రవరి 1న నిర్వహించే మానేరు క్యాట్ 2026 స్కాలర్‌షిప్ టెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం మానేరు సిబిఎస్‌ఈ పాఠశాలలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని భవిష్యత్తును పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో మానేరు విద్యాసంస్థలు మానేరు క్యాట్ 2016 పేరుతో వరుసగా నాలుగవ సంవత్సరం స్కాలర్‌షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాట్ పరీక్ష విద్యార్థుల మేధస్సు, విశ్లేషణాత్మక ఆలోచన సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించేలా రూపొందించబడిందని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపల్లు, వైస్ ప్రిన్సిపల్లు, ఇంచార్జిలు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులున్నారు.

## జాతరలో మక్కన్‌సింగ్ సేవా సమితి సేవలు

ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడలోని శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతరలో మక్కన్‌సింగ్ సేవా సమితి సభ్యులు బుధవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. గోయల్‌వాడకు చెందిన యూత్ కాంగ్రెస్ మండల నాయకులు సంకరి అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు జాతరలో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే సభ్యులకు రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ టీషర్టులను అందజేశారు. ప్రతి జాతరలో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న యువకులను ఎమ్మెల్యే అభినందించారు. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నివిధాల సేవలు అందించాలని యువకులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మల్లెంపల్లి శ్రావణ్, గాదం కుమార్,సంతోష్, చోటు, అల్తాఫ్, చరణ్, సంకరి అభిరామ్, వినయ్, సంకరి శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## జిల్లా మున్సిపల్ ఎన్నికల పరిశీలకులుగా నియామకం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ రెరా సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో అందుబాటులో ఉంటారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకునే వారు వారిని సంప్రదించాలని డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

## వేములవాడ అర్బన్ మండల తహసీల్దార్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్ :** వేములవాడ అర్బన్ మండల తహసీల్దార్ గా అకారపు జయంత్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వేములవాడ అర్బన్ మండల తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు తంగళ్లపల్లి మండలానికి బదిలీ కాగా తంగళ్ళపల్లి తహసిల్దార్ గా విధులు నిర్వర్తిస్తున్న జయంత్ కుమార్ ను వేములవాడ అర్బన్ మండలానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఉత్తర్వులు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన తహసీల్దార్ గా జయంత్ కుమార్ బుధవారం రోజు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎం కప్ నిర్వహణ విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండల స్థాయిలో అన్ని గ్రామల ఆసక్తి గల యువకులు అండర్ 18 టోర్నమెంట్, క్రీడలు ఖోఖో,వాలిబాల్,కబడ్డి పోటీలు 30,31 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజాపరిషత్ అధికారి గుండోజు సత్తయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల ప్రకటనలో మాట్లాడారు.ఆసక్తి గల యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆసక్తి గల వారు క్రీడాప్రాంగణంకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.వివిధ గ్రామాల నుండి వచ్చి క్రీడలలో పాల్గొనవలసిందిగా ఆయన తెలిపారు. అథ్లెటిక్స్‌లో 18 సంవత్సరాలు నిండిన వారు ఎవరైన అర్హులేనని చెప్పారు.

## తొలిరోజే జోరుగా 16 నామినేషన్లు

**ప్రజాపక్షం/వేములవాడటౌన్:** వేములవాడ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో పట్టణంలో రాజకీయ కోలాహలం మొదలైంది. మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులకు గాను నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు మొత్తం 16 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ మద్దతుదారులతో తరలివచ్చి నామినేషన్ పత్రాలను సమర్పించారు. మొదటి రోజు దాఖలైన నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే.. అధికార కాంగ్రెస్ పార్టీ నుండి అత్యధికంగా 8 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, బీఆర్ఎస్ పార్టీ నుండి 5 మంది, బీజేపీ నుండి ముగ్గురు అభ్యర్థులు తమ పత్రాలను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులెవరూ మొదటి రోజు నామినేషన్లు వేయలేదు. పట్టణంలోని 28 వార్డుల్లోనూ ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాది

### తహసీల్దార్ అబ్దుల్ మజీద్

### మై భారత్ మై వోట్ అవగాహన ర్యాలీ




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని తహసిల్దార్ అబ్దుల్ మజీద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మై భారత్ జిల్లా ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో బుధవారం మై భారత్ మై వోట్ అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తహసిల్దార్ అబ్దుల్ మజీద్ ,కరీంనగర్ ఉమ్మడి జిల్లా యువజన అధికారి రాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును వినియోగించుకోనీ తమ వంతు బాధ్యతగా దేశాభివృద్ధిలో భాగ్య స్వాములు కావాలని అన్నారు . ప్రతి పౌరుడు ఓటు హక్కుని వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించారు.ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎన్నికలను స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా నిర్వహించడం ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు.అనంతరం ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని విద్యార్థులచే ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు . అర్హులైన ఓటర్లను గుర్తించి వారిని ఓటర్ జాబితాలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు . ఈ సందర్భంగా కొత్తగా ఓటు హక్కు పొందిన పలువురు యువతీ యువకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మల్లయ్య, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భూమేష్ ,యువజన వాలంటరీ మారం గణేష్ ,ఆర్ ఐ జీవన్,ఆర్గనైజర్స్ మనోజ్ ,రవితేజ, అజయ్, రాహుల్, ఆదిత్య, శ్యామల, లహరి,విద్యార్థులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో బిర్యానీ సెంటర్ దగ్ధం



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్దనున్న స్టార్ బిర్యాని సెంటర్ లో బుధవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ తో నిప్పు అంటుకొని బిర్యాని సెంటర్ దగ్ధమైంది. హోటల్ లోని ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయి రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. బాధితుల కథనం ప్రకారం. రోజులాగే సిబ్బంది హోటల్ కు తాళాలు వేసి ఇంటికి వెళ్లగా తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.ప్రమాదాన్ని చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. హోటల్లో వుంచిన 95వేల నగదు తో పాటు పూర్తిగా ఫర్నిచర్ అగ్నికి ఆహుతి అయింది.ప్రమాదంలో సుమారు పది లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్సై జి.మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మరోసారి మున్సిపల్ బరిలో కృష్ణవేణి హరీష్



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో పట్టణంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నామినేషన్ల స్వీకరణ తొలిరోజే ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ బలాన్ని ప్రదర్శిస్తూ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం, వార్డు ప్రజలతో ఉన్న అనుబంధమే పెట్టుబడిగా రామతీర్థపు కృష్ణవేణి హరీష్ దంపతులు మరోసారి ఎన్నికల బరిలోకి దిగారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ తరఫున 12వ వార్డు అభ్యర్థిగా కృష్ణవేణి హరీష్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన సమయంలో 12వ వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వార్డు రూపురేఖలను మార్చడంలో శక్తివంచన లేకుండా కృషి చేశామని ఈ సందర్భంగా కృష్ణవేణి హరీష్ దంపతులు పేర్కొన్నారు. వార్డులో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడానికి, పేద ప్రజల సమస్యలను పరిష్కరించి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమకు మరో అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ అందుబాటులో ఉంటూ సేవ చేసే గుణం తమకు ఉందని, వార్డు అభివృద్ధిని కాంక్షించే ఓటర్లు తమను ఆశీర్వదించాలని కోరారు.

## జగదీశ్వర్ శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల టిఎన్‌జిఒ



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** ఇటీవల షిరిడిలో నిర్వహించిన అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18 వ జాతీయ సమావేశాలలో భాగంగా టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన సందర్భంగా బుధవారం కరీంనగర్ టీఎన్జీఓ భవన్ లో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో టీఎన్జీఓ జగిత్యాల జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉద్యోగులు హాజరై మారం జగదీశ్వర్ ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఏఐఎస్జిఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన పట్ల టీఎన్జీఓ సంఘం చూపించే పోరాట పటిమకు నిదర్శనంగా తనకు ఈ పదవి లభించిందని, అలాగే టీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనికి, రాష్ట్ర కోశాధికారి కస్తూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్ కు జాతీయ కార్యవర్గ సభ్యులుగా గౌరవం దక్కిందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిఎన్జీఓ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ.హమీద్, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, హర్మిందర్ సింగ్, జగిత్యాల టీఎన్జీఓ జిల్లా నాయకులు ఎండి.మహమూద్, బి.రవిచంద్ర, ఎ.రాజేశం, కె.సుగుణాకర్, టీవిఎస్.సునీత్ కుమార్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు అరుణ,పాల్గొన్నారు

## సిఎంకప్ నిర్వహణపై సమావేశం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ నిర్వహణ పోటీలలో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో రవీందర్ రావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం గురించి ఎంపీడీవో మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే సీఎం కప్ లో కబడ్డీ , కోకో ,వాలీ బాల్ , ఫుట్బాల్ ,యోగ ,అథ్లెటిక్స్ క్రీడలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులకు ఈనెల 30 న మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల గొల్లపల్లి నందు సెలక్షన్ నిర్వహించబడునని ఎంపీడీవో రవీందర్ రావు తెలిపారు .రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు ఈనెల 30 వ తేదీన వచ్చేటప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న ఐడి జిరాక్స్ వెంట తీసుకొని రావాలని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో , ఎం పీ ఓ ప్రదీప్ ,ఎం ఈ ఓ చెరుకు రాజన్న,పి ఈ టి ,పి డి లు సాగర్,భాస్కర్ ,విజయ పాల్గొన్నారు.

## లైన్ మెన్ రాజును సన్మానించిన నాయకులు



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో విధ్యుత్ శాఖ లో లైన్ మెన్ గా పని చేస్తున్న కోలిపాక రాజు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ లైన్ మైన్ గా జిల్లా విధ్యుత్ శాఖ అదికారి సుదర్శనం చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. సందర్భంగా బుధవారం వేములకుర్తి గ్రామంలో జనసేన, కాంగ్రెస్, బిజెపి లకు చెందిన నాయకులు,గ్రామస్తులు వేరువేరుగా శాలువలతో ఘణంగ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు రాధరపు ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు పుప్పాల నాగేశ్,రెడ్డవేన జయ రాజ్,అరె రమేష్, ఇజాపు రాజరెడ్డి,బుర్రి లక్ష్మి నారయణ,రాధరపు దేవదాస్, కారం ఇంద్రయ్య, ఉసికెల చిన్నయ్య, ఎడిపెల్లి గంగారెడ్డి, నేమురి సాయి కుమార్,కోటగిరి వెంకటస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఇటీవల ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలుగందుల నర్సింహులు మాతృమూర్తి దేవవ్వఅనారోగ్యంతో భాదపడుతూ మరణించిం ది. బుధవారం ఆయనను నర్సింహులును ఆయన నివాసం వద్దకు వెళ్ళి కలిసారు. నాఫ్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, రెడ్డిసంఘం అద్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి పరామర్శించి ఓదార్చారు. వారి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. తల్లి దేవవ్వ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మండల సెస్ అద్యక్షులు వర్సకృష్ణహరి, గ ంబీరావుపేట అద్యక్షులు వెంకటస్వామి ఉన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తండి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త పోరాటాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ పిలుపునిచ్చారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలో ఎంపీఓ మన్మోహన్ శాస్త్రికి సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన 4లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. పేదలందరికీ పని గ్యారంటి కల్పించి, ఆర్థిక భద్రత కల్పించాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ. 21వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న కార్మికులకు కనీస గుర్తింపు ఇవ్వకుండా మొండి చేయి చూపుతోందని ఆయన హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పద్మ, ఎడపల్లి మండల కార్యదర్శి ప్రవీణ్, మండల అధ్యక్షులు గోపాల్, నాయకులు రాజయ్య, మల్లయ్య, సింహాద్రి, సులోచన, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని కలిగి ఉన్నతంగా ఎదగాలి



**ప్రజాపక్షం/రాయికల్ :** బాలికలు క్రీడా స్ఫూర్తిని కలిగిఉండి చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని జగిత్యాల ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలోని పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలతో ఆమె మాట్లాడుతూ శ్రద్ధ, పట్టుదల, ఏకాగ్రత తో చదివితే మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని అన్నారు. చెడు వ్యసనాలకు, దూరంగా ఉండాలని. అత్యవసర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న సి.యం.కప్ క్రీడా పోటీల గూర్చి తెలుసుకున్నారు. రాయికల్ యస్ఐ సుధీర్‌రావు ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ, పురె రమేష్, పి.గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు రవీష్ రెడ్డి భీమేష్, జగన్, నితీన్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## యస్‌టిఒలకు ఘన సన్మానం భగవద్గీతల ప్రదానం



**ప్రజాపక్షం/రాయికల్ :** జగిత్యాల సబ్ ట్రెజరీ ఆఫీసర్ మానుక సత్యనారాయణ యాదవ్ ను, వెటర్నరీ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్న వెల్పుగొండ కుమార స్వామి యాదవ్ లను తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘ పక్షాన రాష్ట్ర శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, అప్పాల గంగయ్య యాదవ్, బీనవేని గంగన్న యాదవ్ లు బుధవారం ఘనంగా శాలువాలతో సత్కరించి భగవద్గీతలను ప్రదానం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. బిసి ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు అమలు చేయాలని, 24 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు.

## ఇందిరానగర్‌లో అస్తవ్యస్తమైన సిసి రోడ్డు

**ప్రజాపక్షం/రాయికల్:** రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ 3వ వార్డులో గత రెండు నెలల క్రితం మరమ్మత్తుల నెపంతో సీసీ రోడ్డు మరియు లోకల్ వాటర్ పైపులైన్‌ను పగలగొట్టి వదిలేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.మూడో వార్డులోని ప్రధాన సీసీ రోడ్డుపై అనుకొని ప్రైమరీ స్కూల్ ఉండటంతో విద్యార్థుల రోజువారీ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై తవ్వి వదిలేసిన గుంతల వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.అదే విధంగా అత్యవసర సమయాల్లో అవసరమయ్యే 108 అంబులెన్స్‌లు, ఇతర సేవా వాహనాలు రాకపోవడం కాలనీవాసుల్లో భయాందోళనలకు కారణమవుతోంది.ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఇదే ప్రాంతానికి సమీపంలో జరుగుతున్న



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనుండటం. గుంతలు, ధ్వంసమైన రోడ్డు కారణంగా ఓటర్లు పోలింగ్‌కు వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిస్థితిపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులు, మున్సిపల్ యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకుని సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఇందిరానగర్ కాలనీ వాసులు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం

**ప్రజాపక్షం/మల్యాల :** పదో తరగతి విద్యార్థులకు రానున్న వార్షిక పరీక్షలపై భయం పోగొట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంచే దుకు విజయోస్తు పేరిట ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించామని జగిత్యాల డిఈఓ రాము తెలిపారు.జగిత్యాల జిల్లా



మల్యాల మండలం లో ఢిల్లీ డిఫెన్స్ కరీంనగర్ ఆధ్వర్యంలో మండలం లోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థిని,విద్యార్థులకు విషయవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఇష్టపడి చదివి 100% ఉత్తీర్ణత సాధించి గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అత్యధిక మార్కులు సాధించి జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం ప్రథమ స్థానం సాధించాలని ఆయన కోరారు. సబ్జెక్టు నిపుణులతో పిల్లలకు మెళకువలు నేర్పించారు. పరీక్షల్లో ఎక్కువ మార్కులు ఎలా సాధించాలి.ఎలా చదవాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్యాల ఎంఈఓ జయసింహారావు, ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సురేష్ రెడ్డి, మల్యాల మండలం ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతాప్ కిషన్‌రావు పొన్న మహేష్, దయానందర్ ,సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల దాఖలు మొదటి రోజు ప్రశాంతం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ లో మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని మొత్తం 66 డివిజన్లకు సంబంధించి 33 నామినేషన్ కౌంటర్లలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నామినేషన్ల ను స్వీకరించి...ఎన్నికల సంఘం రూపొందించిన ఆన్ లైన్ టి పోల్ వెబ్ సైట్ లో వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరిచారు. మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో మొత్తం 76 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా 66 డివిజన్ల లో మొత్త 80 నామినేషన్లు రావడం జరిగింది. నామినేషన్ల ప్రక్రియను కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ స్వయంగా రిటర్నింగ్ అధికారుల కౌంటర్లను సందర్శించి తనిఖీ చేసి పరిశీలించడం జరిగింది. అంతే కాకుండా నగరపాలక సంస్థ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కమీషనర్ నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ఎన్నికల నియమ నిబంధనలను



అనుసరించి మొదటి రోజు సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్ బంధోబస్తు మధ్య డివిజన్ల వారిగా పోటీ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించడం జరిగిందని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ధాఖలైన ప్రతి నామినేషన్ ప్రత్రాన్ని ఎన్నికల నియమావళి అనుసరించి ఉందా... లేదా అన్న కోణంలో తనిఖీ చేసి పరిశీలన చేస్తూ, ఎన్నికల సంఘం రూపొందించిన ఆన్ లైన్ టీ పోర్టల్ లో ఎప్పటికప్పుడు నామినేషన్ల వివరాలను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా ప్రచార ర్యాలీలు, రోడ్ షోలు, పబ్లిక్ మీటింగ్ లు, స్టార్ కంపేనర్స్ తో ప్రచారం కోసం పోలీస్ శాఖ ఒన్ ఓ సి పొంది ఎంసీసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో దరఖాస్తు చేస్కోని అనుమతి పొందాలని తెలిపారు.

## అమ్మవార్లకు సింగరేణి సేవా సమితి పూజలు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని కోల్‌బెల్ట్ వంతెన వద్ద నిర్వహిస్తున్న శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతరను సింగరేణి ఆర్‌జి1 ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా సభ్యులు బుధవారం సందర్శించారు. అమ్మవార్లను దర్శనం చేసుకొని పూజలు చేశారు. అనిత లలిత్‌కుమార్ సేవా సభ్యులతో కలిసి అమ్మవార్లకు చీర, సారె, గాజులు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి ముడుపులు చెల్లించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు మాట్లాడుతూ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్, సింగరేణి ఆర్‌జి1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్‌తోపాటు స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు, రామగుండం నగరపాలక సంస్థ సహకారంతో జాతర ప్రాంగణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు, భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. వనదేవతల కృపతో సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సెక్రటరీ బీనాసింగ్, లేడీస్ క్లబ్ సెక్రటరీ శిరీష, స్వరూప, అంజలి, సునీతా, సభ్యులు సత్యవతి, రమాదేవి, సునీతా, లత, అంజలి, శ్రుతిమ, వనిత, సుజాతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు

**ప్రజాపక్షం/మండలం:** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రైమరీ పాఠశాలలో, మూత్రశాల నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో కలిసి పంచాయతీ రాజ్ ఏ ఈ రాగసుధ స్థల పరిశీలన జరిపారు. అదేవిధంగా రేగొండ గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్, ప్రైమర్ స్కూల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి,తిట్ల లహరి రాజేష్, మండల విద్యాధికారి దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రంగురామా గౌడ్, ఉపాధ్యాయులు,తదితరులు ఉన్నారు.

## గుడి పేటలో దివ్యాంగులకు చేతి కర్రల పంపిణీ

**ప్రజాపక్షం /మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం గుడి పేట గ్రామంలో బుదవారం ఫాతిమా నగర్ అదోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విభిన్న సామర్థ్యం (వికలాంగులు)కలిగిన నలుగురి కి చేతి కర్రలు సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి, సంస్థ కో ఆర్డినేటర్ మర్రి మల్లేశం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొట్టె అనిత నరేష్,వార్డు మెంబర్స్ హరీష్, గణేష్, లింగారెడ్డి, మల్లయ్యా, రాజిరెడ్డి, గంగారెడ్డి, గంగయ్య, శంకరయ్య, సాత్విక, రాజు, రాకేష్, గంగాధర్, మధుసూదన్, సంతోష్, సతీష్ సంజీవ్, రాజయ్య పాల్గొన్నారు.

## పిఎం కప్ పోటీలలో గ్రీన్ వుడ్ విద్యార్థుల విజయకేతనం

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో జరిగిన మండల స్థాయి సిఎం కప్పు పోటీలలో గ్రీన్ వుడ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు దీనిలో గర్ల్స్ విభాగంలో మండల స్థాయిలో వాలీ వాలీబాల్ విభాగంలోమొదటి స్థానం లో మరియు ఖో ఖో విభాగంలో రెండో స్థానంలో నిలిచారు.దీనిలో ముఖ్య అతిథులుగా అడిషనల్ ఎస్పీ శైలేంద్రనీ రెడ్డి మరియు రాయికల్ సబ్ ఇన్స్పెక్టర్ సుధీర్ రావు,ఎంపీడీవో బి.చిరంజీవి, మండల విద్యాధికారి రాఘవులు పిడి కృష్ణ ప్రసాద్ మరియు వివిధ పాఠశాలల పీడీలు విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్పీ శైలేంద్రిని రెడ్డి విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవనంలో ఎస్‌పి నితికా పంత్, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 30 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు చేపడతామని వెల్లడించారు. ఆసిఫాబాద్ లో 28, కాగజ్ నగర్ లో 85 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిఘా కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని తెలిపారు. కలెక్టరేట్ లో 8500844365 నంబరుతో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని వివరించారు. జిల్లా ఎస్‌పి నితికా పంత్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. సభలు, ర్యాలీలకు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలని, లైసెన్స్ ఆయుధాలు ఉన్నవారు వెంటనే డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాధితుడి వద్దకే వెళ్లి విచారించిన న్యాయమూర్తి



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** పెరాలిసిస్‌తో బాధపడుతున్న వ్యక్తి పరిస్థితిని గమనించి స్వయంగా న్యాయమూర్తి కోర్టు వెలుపలికి వచ్చి కేసును పరిశీలించిన ఘటన బుధవారం సిర్పూర్ టి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. జూనియర్ సివిల్ కోర్టులో ఓ కేసు విచారణకు హాజరైన వ్యక్తి నడవలేని స్థితిలో ఉన్నాడని తెలుసుకున్న న్యాయమూర్తి అజయ్ ఉల్లాం మానవత్వంతో స్పందించారు. బాధితుడిని కోర్టు హాలుకు తీసుకురావడం కష్టమని భావించి స్వయంగా బయటకు వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే కేసు సంబంధిత అంశాలపై విచారణ జరిపి వివరాలను సేకరించారు. న్యాయమూర్తి చూపిన మానవీయ వైఖరి పట్ల న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ చొరవ న్యాయవ్యవస్థపై సామాన్య ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచిందని వారు కొనియాడారు.

## ఎస్‌సి, ఎస్‌టి హక్కుల సాధనకు కృషి చేస్తా

**ప్రజాపక్షం / జన్నారం :** ఎస్‌సి, ఎస్‌టి వర్గాల ప్రజలకు అండగా నిలబడి వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన జన్నారం మండలానికి వచ్చిన సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు సిటిమల భరత్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దమ్మ నారాయణ మాట్లాడుతూ బాధితులకు భరోసా కల్పిస్తూ ఎస్‌సి, ఎస్‌టి వర్గాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా తోడ్పడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, మామిడిపెల్లి ఇందయ్య, గుగ్లావత్ రవి నాయక్, దుమల్ల రమేష్, కొండుకూరి ప్రభుధాస్, మేకల మాణిక్యం, మేకల అక్షయ్ కుమార్, జంగం రవి, దుమల్ల ప్రవీణ్, కొండుకూరి రాజు, కుంద నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఇఎస్ అధికారులు, సర్పంచ్ ఒడ్డేటి నాగమణి నానాయ్యా అధికారులకు సూచించారు. బుధవారం సిర్పూర్ టి గ్రామ పంచాయతీ కార్యాలయంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, వార్డు సభ్యులతో కలిసి గ్రామాభివృద్ధి అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం ఎంఇఎస్ అధికారులు స్థానిక సిహెచ్‌సి, హైస్కూల్, మహిళా సంఘాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఎంపిడిఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. సంబంధిత అధికారుల నుండి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యనారాయణ, ఎంఇఓ సదాశివుడు, తహసీల్దార్, ఎపిఎం మహేష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉప సర్పంచ్ ప్రశాంత్, వార్డు సభ్యులు ముక్రమ్ హుస్సేన్, జినాథ్ కలాం పటాన్, బి. సాయి, అస్లాం బిన్ అబ్దుల్లా, మొయిజ్, శివ, అమీన్ పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎస్‌పి నితిక పంత్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి నితిక పంత్ తెలిపారు. బుధవారం కాగజ్ నగర్ పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంతో పాటు డివివి పబ్లిక్ స్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల సమీపంలో 100 మీటర్ల వరకు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులను లోపలికి అనుమతించకూడదని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం పట్టణ పరిధిలోని బట్పల్లి ఎక్స్ రోడ్, వినయ్ గార్డెన్ వద్ద ఉన్న అగ్రికల్చర్ చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, కాగజ్ నగర్ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, రూరల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.

# ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ రద్దు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కమిటీని రద్దు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. రెండేళ్ల పదవీకాలం పూర్తికావడంతో ప్రస్తుత కమిటీని రద్దు చేస్తూ, తాత్కాలికంగా జిల్లా అడక్ కమిటీని నియమిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ మాజిద్, ప్రధాన కార్యదర్శి గౌస్ మొహియుద్దీన్, ఉపాధ్యక్షుడు ఎజాజ్ అహ్మద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నూతన కమిటీ ఏర్పడే వరకు అడక్ కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందని వారు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ హనాన్, కోఆర్డినేటర్‌గా సయ్యద్ సుజార్‌ను నియమించారు. సిర్పూర్ నియోజకవర్గం కాగజ్ నగర్‌కు చెందిన ముహమ్మద్ మాజిద్ ఇక్బాల్, నసీర్ అహ్మద్ ఖాన్‌లను కన్వీనర్‌లుగా నామినేట్ చేసినట్లు రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసింది.

## ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలి

ఎంఈఓ వై.తిరుపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండల ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలని మండల విద్యాశాఖ అధికారి వై.తిరుపతిరెడ్డి సూచించారు. బుధవారం ప్రాథమికస్థాయి పాఠశాలల సముదాయాల సమావేశాన్ని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అచ్చంపేట్‌లో నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేసి విద్యార్థులను ఈ సామర్థ్యాలలో రాణింపజేయాలని అన్నారు. మిడ్‌లైన్ టెస్టుకు సంబందించి పాఠశాలల వారీగా, తరగతి వారీగా విద్యార్థుల ప్రతిభను పరీక్షించి ఎండ్‌లైన్ పూర్తి అయ్యేంత వరకు ఉపాధ్యాయులు లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు. ఫోరెన్సిక్ అనే అంశంపై నర్సింగ్‌రావుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రనీష మాదిరి పాఠంశాన్ని బోధించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకటేశం, సీఆర్‌పీలు బి.శ్రీధర్‌కుమార్, ఎం.వరలక్ష్మి, పి.నర్సింలు, కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 29న నిజాంసాగర్‌లో సిఎం కప్ క్రీడలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలస్థాయి సీఎంకప్ క్రీడాపోటీలు ఈనెల 29, 31 తేదీలలో జవహర్ నవోదయా విద్యాలయంలో నిర్వహించబడతాయని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న కబడ్డీ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తుండగా కబడ్డీకి ఓపెన్ టు ఆల్, వాలీబాల్ 18 సం.లు పైబడిన బాల బాలికలకు నిర్వహించబడతాయన్నారు. 31వ తేదీనా ఖోఖో 18 సం.ల పై బాల బాలికలకు, అథ్లెటిక్స్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్లకు బాల బాలికలకు నిర్వహించబడతాయన్నారు. అదేవిధంగా యోగా, కరాటే, చెస్ పోటీలు నిర్వహించబడతాయన్నారు. ఆయా గ్రామపంచాయతీలలో క్రీడలలో ఎంపికైన క్రీడాకారులు, పంచాయతీ జట్టుగా ఏర్పడి మండలస్థాయి క్రీడలలో పాల్గొని విజయవంతం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు తమ తమ గ్రామపంచాయతీ జట్లకు ఇంచార్జీగా వ్యవహబూరించాలని ఎంపీడీఓ శివకుమార్, ఎంఈఓ వై.తిరుపతిరెడ్డిలు కోరారు. మండల క్రీడల ఆర్గనైజింగ్ సెక్రెటరి పి.వెంకటి పేర్కొన్నారు.

## బిసి సంక్షేమసంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన సర్పంచ్



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలో బుధవారం గ్రామ సర్పంచు కుమ్మరి శేఖర్ జాతీయ బీసీ సంక్షేమసంఘం 2026 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమసంఘం ద్వారా ఆవిష్కరించిన క్యాలెండర్ ఎంతో బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు నీలకంటి సంతోష్, జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జీ ఆకుల లక్ష్మణ్‌యాదవ్, పిట్లం అధ్యక్షుడు సనపుల మధుకృష్ణ, పట్టణ అధ్యక్షుడు గుర్రపు బాల్‌రాజ్, ఉపాధ్యక్షుడు అఫ్రోజ్, రామాగౌడ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా సాగాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని మున్సిపల్,జిల్లా పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని పరిశీలించి,అధికారులకు పలు సూచనలు చేశారు.నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు ప్రక్రియపై ఎటువంటి సందేహాలు ఉన్న హెల్ప్ డెస్క్ సిబ్బంది నివృత్తి చేయాలని తెలిపారు.అనంతరం నామినేషన్ స్వీకరణ కేంద్రాలు పరిశీలించారు.విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ,నామినేషన్ దాఖలు ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు.సంబంధించిన అన్ని ఫారములు,రిజిస్టర్లను జాగ్రత్తగా పూరించాలి అని తెలిపారు.అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.ఎప్పటికప్పుడు నామినేషన్ల స్వీకరణకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు అందజేస్తూ ఉండాలని చెప్పారు.అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు.ముందుగా హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడుతూ,నామినేషన్ వేసేవారికి సహాయపడాలని అన్నారు.తగినన్ని కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు,త్రాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు.నామినేషన్లు స్వీకరించే అధికారులతో మాట్లాడుతూ,ఎక్కడకూడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని రిజిస్టర్లను పరిశీలించారు.నామినేషన్ కేంద్రంలో ప్రతి రోజు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు.ఈ నామినేషన్ కేంద్రం తనిఖీలో ఆర్డీఓ రత్నకళ్యాణి,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి,ఫిర్యాదుల స్వీకరణ కొరకు జిల్లాలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.9100577132 నంబరు ను సంప్రదించడం ద్వారా మున్సిపల్ ఎన్నికలపై ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత కొరకు హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.



## బాగాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని బాగాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీవేద ప్రణీత్ రెడ్డి పారిశుద్ధ పనులు ముమ్మరంగా చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మురికి కాలువలు డ్రైన్లు చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని మురికి ఆగి ఉన్నచోట జెసిబి సాయంతో మురికి కాలువలను శుభ్రపరచడం,బ్లీచింగ్ పౌడర్ చేయడం జరిగిందని తెలిపారు.

**లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని నగర్ గ్రామ సర్పంచ్ బచ్చన్న పారిశుద్ధ పనులు ముమ్మరంగా చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మురికి కాలువలు డ్రైన్లు చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని,మురికి ఆగి ఉన్నచోట పారిశుద్ధ కార్మికుల చే మురికి కాలువలను శుభ్రపరచడం,బ్లీచింగ్ పౌడర్ చేయడం జరిగిందని తెలిపారు.

## ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కం డక్ట్) కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.ఆర్వో,ఏఆర్వో లనియామకం పూర్తయిందని అన్నారు .వివిధ దశల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించుకోవడంతో పాటు,వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలని అన్నారు.అధికారులంతా సమన్వయంతో పనిచేసి,నామినేషన్ల ప్రక్రియ మొదలుకొని,ఎన్నికల నిర్వహణ, ఫలితాల వెల్లడితో సహా మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మొత్తం ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్లు,ఆ ర్డీఓ రత్నకళ్యాణి,డీఈవో భోజన్న,జెడ్పీ సీఈవో శంకర్,ఎన్నికల వ్యయ పరిశీలకు లు షుజా ఉద్దిన్,ఇతర సిబ్బంది,పాల్గొన్నారు.

# నిర్మల్ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

జిల్లా ఎస్పి జానకి షర్మిల ఐపిఎస్ తనిఖీ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడంతో నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.ఇందులో భాగంగా నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ సందర్శించి,అక్కడ ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు కీలక సూచనలు చేస్తూ,నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.అభ్యర్థులు,వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని,కేంద్రాల వద్ద గుంపులుగా రావడం,నినాదాలు చేయడం లేదా ర్యాలీలు నిర్వహించడం వంటి చర్యలను అనుమతించరాదని స్పష్టం చేశారు.ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని,సీసీటీవీ కెమెరాల నిఘా,మెటల్ డిటెక్టర్ల తనిఖీలు,బారికేడ్ల ఏర్పాటు ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.జిల్లాలో శాంతియుత,స్వేచ్ఛాయుత,నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని,ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో ఎస్పీతో పాటు మున్సిపల్ కమిషనర్,ఇన్స్పెక్టర్లు నైలు,కృష్ణ,సమ్మయ్య,ఎస్ఐ గణేష్,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేశామని,అక్రమ నగదు,మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్పీ వివరించారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు సహకరించాలని,సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు.

## జాతీయ రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాపక్షం/బోథ్ :** జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు బుధవారం బోథ్ ఆదర్శ పాఠశాల లో రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు పోలీసులు నిర్వహించారు.ఈ వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మొదటి ముగ్గురు విజేతలకు బోథ్ ఎస్సై పురుషోత్తం,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ బహుమతులు బహూకరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది మోహన్,రంజిత్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసిన మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి.వీరా రెడ్డి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినావ్ ను బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు.పూలమొక్కను అందించారు.అనంతరం ఇరువురు సమావేశమై మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలను చర్చించారు.

## ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా అవార్డు అందుకున్న శ్రీధర్ లెక్చరర్ కు ప్రిన్సిపల్ గౌతమ్,అధ్యాపక సిబ్బంది అవార్డ రావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతూ శాలువాతో సత్కారం చేశారు.

## తొలిమెట్టు లక్ష్యాలను సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి

దర్శనం భోజన్న

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యార్థులలో కనీస అభ్యాస సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ) దర్శనం భోజన్న పిలుపునిచ్చారు. బుధవారం నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లి లో నిర్వహించిన ప్రాథమిక స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు.రానున్న ఫిబ్రవరి నెలలో మూడవ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షల్లో ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిని ఇప్పటి నుండే సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా 'తొలిమెట్టు' కార్యక్రమంలో భాగంగా నిర్ణయించిన అన్ని సామర్థ్యాలను,అంత్య పరీక్షల నాటికి విద్యార్థులందరూ వంద శాతం సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.బోధనలో నాణ్యతను పెంచుతూ,వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.

# నిర్మల్ నుంచి 'జగన్నాథ'యాత్ర

ఫిబ్రవరి 4న ప్రత్యేక బస్సు ప్రారంభం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆధ్యాత్మిక యాత్రికుల కోసం నిర్మల్ ఆర్టీసీ డిపో మరో అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది.ఒరిస్సాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుని దర్శనంతో పాటు,దక్షిణ భారతంలోని కీలక ఆలయాలను సందర్శించేలా ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్(డియం)కె.పండరి ఒక ప్రకటనలో తెలిపారు.వాస్తవానికి ఈ బస్సు యాత్రను ఫిబ్రవరి 6న ప్రారంభించాలని అధికారులు తొలుత భావించారు.అయితే,రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా,భక్తుల విన్నపాన్ని మన్నించి ఈ తేదీని ఫిబ్రవరి 4వ తేదీకి మార్చారు.ఈ ప్రత్యేక బస్సు ఫిబ్రవరి 4న నిర్మల్ నుండి బయలుదేరి,యాత్ర ముగించుకుని ఫిబ్రవరి 9వ తేదీన తిరిగి నిర్మల్ చేరుకుంటుంది.

సందర్శించే పుణ్యక్షేత్రాలు ఇవే..

ఈ ఐదు రోజుల యాత్రలో భక్తులు ఈ క్రింది ప్రముఖ ఆలయాలను సందర్శించవచ్చు..అన్నవరం(సత్యనారాయణ స్వామి), సింహాచలం(నరసింహ స్వామి),అరసవల్లి(సూర్యనారాయణ స్వామి),పూరి జగన్నాథ్(శ్రీకృష్ణ ఆలయం) ,కోణార్క్(సూర్య దేవాలయం),ద్వారక తిరుమల తక్కువ ధరలోనే సురక్షిత ప్రయాణం ఒరిస్సా రాష్ట్రంలోని జగన్నాథుని ఆలయానికి నిర్మల్ డిపో నుండి వెళ్తున్న మొట్టమొదటి బస్సు ఇదే కావడం విశేషం.రానుపోను ప్రయాణానికి ఛార్జీగా కేవలం రూ.6,400 మాత్రమే నిర్ణయించారు. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే ఇది అత్యంత చౌకైన,సురక్షితమైన ప్రయాణమని డిఎం పండరి పేర్కొన్నారు. నివృత్తి కోసం ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. 99592 26003 ,83280 21517, 73828 42582 జగన్నాథుని దర్శనం కోసం వేచి చేస్తున్న భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని యాత్రను విజయవంతం చేయాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

## బిజెపిలో చేరిన భాగ్యనగర్ కాలనీ ముఖ్య నాయకులు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన ముఖ్య నాయకులు కమ్మం సురేందర్,పూసాల సంఘం అధ్యక్షుడు పసులోటి శ్రీనివాస్,తో పాటు సంఘ ముఖ్య నాయకులు తిరుపతి,రమణ,నారాయణ,శ్రీహరి,తోపాటు కాలనీ వాసులు,యువకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి,బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, పట్టణ బీజేపీ నాయకులు సాదం అరవింద్,భూపతి రెడ్డి,తాజా మాజీ కౌన్సిలర్లు పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# భాష్యం హైస్కూల్ లో రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** పట్టణంలోని భాష్యం హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోటార్ వాహనాల సహాయ తనిఖీ అధికారి (ఏఎంవీఐ)సి.హెచ్.రజనీకాంత్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు తమ ఇళ్లలో ఉన్న పెద్దలకు కూడా ఈ నియమాలపై అవగాహన కల్పించాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని రజనీకాంత్ పేర్కొన్నారు.పాదచారులు పాటించాల్సిన జాగ్రత్తలు,సిగ్నలింగ్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రాక్టికల్‌గా వివరించారు.

# మున్సిపాలిటీ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమావేశం

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో,ముథోల్,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి,మాజీ శాసనసభ్యులు భోస్లె నారాయణ రావు పాటిల్ ఆధ్వర్యంలో పార్టీ అంతర్గత సమావేశం శ్రీ ఫంక్షన్ హాల్,బైంసాలో నిర్వహించబడింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్,ఎన్నికల పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్ హాజరై,రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు,శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపిక,స్థానిక పరిస్థితులు, ప్రజా సమస్యలు,ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.జిల్లా డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం కుల ,మతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తోందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్ వంటి పథకాలను పేదల సంక్షేమంకోం అమలు చేస్తోందని,బైంసా మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. మాజీ శాసనసభ్యులు భోస్లె నారాయణ రావు పాటిల్ మాట్లాడుతూ..బైంసా పట్టణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ప్రణాళికలతో సిద్ధంగా ఉందని తెలిపారు.పార్టీ అధిష్టానం ఎవరికైనా టికెట్ కేటాయించినా,ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.మాజీ శాసనసభ్యుడు విఠల్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున భవిష్యత్తులో బైంసా పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడానికి అవకాశాలు ఉన్నాయని,కాంగ్రెస్ పార్టీని గెలిపించి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పార్టీ శ్రేణులకు సూచించారు .ప్రజాస్వామ్యంలో ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని,భవిష్యత్ తరాల మేలుకోసం మార్పు కోసం ఓటు వినియోగించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రివర్యులు వేణుగోపాల చారి అన్నారు.పేదల జీవితాలను మార్చే బలమైన ఆయుధం ఓటేనని,ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి ఫలాలు ప్రజలకు మరింత చేరాలంటే కాంగ్రెస్ పార్టీ వెంట నడవాలని కోరారు.ప్రతి వార్డులో పది మంది చొప్పున ప్రచారంలో పాల్గొని,అభ్యర్థుల విజయం కోసం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్



ఆనంద్ రావు పాటిల్ నాయకులు తెలిపారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని,పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థులకు పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తామని,అభ్యర్థుల ఎంపిక పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే జరుగుతుందని జిల్లా డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. మాజీ శాసనసభ్యులు భోస్లె నారాయణ రావు పాటిల్ ,విట్టల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్,వైస్ చైర్మ న్ ఫారుక్,సీనియర్ నాయకులు కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే,టౌన్ ప్రెసిడెంట్ షాహిన్ అలీ,మాజీ చంద్రకాంత్ యాదవ్, నాయకులు దేవిదాస్ అల్మాస్,జఫర్,పార్టీ నాయకులు, వార్డు అభ్యర్థులు,కార్యకర్తలు పార్టీనాయకులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ పదవులలో ఎస్‌టిలకు తీవ్ర అన్యాయం

### లంబాడీల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్



**ప్రజాపక్షం/నేరడిగొండ :** కాంగ్రెస్‌ప ప్రభుత్వం ప్రకటించిన బల్దియా ఎన్నికల్లో రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలలో ప్రభుత్వం విడుదల చేసిన(జి.ఓభర .ఎంఎస్.నం.14,13.01.2026) ప్రకా రం ఎస్టీలకు ఏడు చైర్మన్ పదవులు రావాల్సి ఉండగా కేవలం ఐదు పదవులు మాత్రమే కేటాయించడం జరిగింది.దీనివల్ల రాష్ట్రంలోని ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్,ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో మొత్తం 2,996 వార్డులు ఉండగా,అధికారిక లెక్కల ప్రకారం ఎస్టీలకు 180 వార్డులు కేటాయించారు.ఇది 6 శాతం 2011 జనగణన ప్రకారం జనాభా వార్డుల్లో 5.8 శాతం,రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం రావలసిన చైర్మన్ పోస్టుల్లో కేవలం 4.13 శాతం మాత్రమే ఇవ్వడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని ఈ అన్యాన్ని ఎవరు పూడుచురో ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు.ధర్మంగా రావాల్సిన వాట ప్రకారం 7 చైర్మన్ లు రావాల్సిన అవసరం ఉంది అని తెలియచేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం లో ఉన్నగిరిజన నాయకులు ఆలోచించి రిజర్వేషన్లు పెంచే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని లేనియెడల గిరిజన నాయకులే బాధ్యత వహించాలి లేకుంటే జాతి ద్రోహులుగా మిగులుతారు.హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో లైవ్ జిల్లా ఇంచార్జ్ రాథోడ్ పాండు లైవ్ బోత్ నియోజవర్గం ఇంచార్జ్ సందీప్ రాథోడ్ లైవ్ మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల సెంటర్లను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు 2026 ను పురస్కరించుకొని నిజామాబాద్ పట్టణంలోని పలు నామినేషన్ సెంటర్ల ఏర్పాట్లను నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ పరిశీలించారు. సిబ్బందితో ఏర్పాట్లను, నామినేషన్లకు వచ్చు అభ్యర్థుల, సంబంధిత ఏర్పాట్లపై సూచనలు చేశారు.

# అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి

### నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు తప్పకుండా ఎన్నికల నియమాలను పాటించాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని మునిసిపల్ కార్పొరేషన్ మునిసిపల్ ఎన్నికలు 2026లో భాగంగా నేడు నిజామాబాద్ డివిజన్‌లోని టౌన్ 4వ పోలీస్ స్టేషన్ పరిధిలోని టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ సెంటర్ల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ సెంటర్ దగ్గరలో 100 మీటర్ల లోపు నిషేదిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని, అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసిపి బి. ప్రకాష్, టౌన్ 4 ఎస్‌హెచ్‌వో సతీష్‌కుమార్, ఆర్‌ఓ వెంకటేశ్, ఏఆర్‌ఓ రమేస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# యంచలో ఆధ్యాత్మిక శోభ

### శ్రీ ఓం జగదాద్రి దేవి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ గ్రామంలో వెలిసిన శ్రీ ఓం జగదాద్రి దేవి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి వివిధ రూపాల్లో అర్చనలు, హోమాలు, విశేష వాహన సేవలు నిర్వహించారు. యజ్ఞయాగాదులు, చండీ హోమంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి మొదలైంది. యాగశాలలో శ్రీ ఓం జగదాద్రి దేవి అవతారం దశ మహావిద్యలో భాగమైన శ్రీ ఓం భువనేశ్వరి, శ్రీ ఓం శోడసి దేవి అమ్మవార్లకు ప్రత్యేక యజ్ఞములు నిర్వహించారు. పూర్ణాహుతి, హారతి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయంలో లోక కళ్యాణార్థం చండీ హోమం నిర్వహించారు. ప్రధాన గర్భ గుడిలో శ్రీ ఓం శ్రీ చక్ర అభిషేకం చేపట్టగా, అమ్మవారు బుధవారం శ్రీ ఓం బాలంబిక దేవిగా భక్తులు అమ్మవారి ప్రత్యేక్ష దర్శనం చేసుకోగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన గర్భగుడిలో మహిషాసుర మర్ధినిదేవి అలంకరణతో మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ జగధాత్రి దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రు లు కావాలని ఆలయ కమిటీ ట్రస్ట్ కోరుతున్నారు.

# విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ లో బుధవారం వెటర్నరీ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో జంతు సంరక్షణ, పౌరుల బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించామని మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి తెలిపారు. ఈ పోటీలకు మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పోటీలో ప్రథమ స్థానంలో ఎంజెపిటి మోర్తాడ్ పాఠశాలకు చెందిన బి. స్నేహితు, జడ్పీహెచ్‌ఎస్ ధర్మోరాకు చెందిన డి.గంగోత్రి, రెండవ స్థానంలో నిలిచిందన్నారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో ప్రణీత, జడ్పీహెచ్‌ఎస్ మోర్తాడ్ మరియు రెండవ స్థానంలో శ్రీ నిత్య, జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ మోర్తాడ్



రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ ధర్మోరా ప్రధానోపాధ్యాయులు రఘునందన చారి, జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ మోర్తాడ్ ఉపాధ్యాయులు కె.వినోద్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. 10వేల వస్తువుల వితరణ

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ చిట్టాపూర్‌లో విద్యనభ్యసించిన 201516 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు చిట్టాపూర్ ఉన్నత పాఠశాలకు తమ వంతు సహకారంగా కార్డులెస్ మైక్‌సెట్, కార్పెట్లు, చెమ్మెలు మొత్తం పదివేల విలువ చేసే వస్తువులను అందజేసి పాఠశాల పట్ల తమకున్న భక్తి భావనను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇందూరు శేఖర్, వారి బ్యాచ్ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అభినందించారు.ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, నర్సారెడ్డి, భృగు మహర్షి, రామారెడ్డి, శ్రీనివాస్, పద్మ, ప్రవీన్, రాజేందర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పొలంలో కలుపు తీసిన మోడల్ స్కూల్ విద్యార్థులు





**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఓకేషనల్ ఎడ్యుకేషన్ (అగ్రికల్చర్)లో భాగంగా పొలంలో కలుపు తీయించారు. అదేవిధంగా పొలంలో వచ్చే రోగాలు, కలుపు నివారణపై పిల్లలకు ఓకేషనల్ ట్రేనర్ ఆశం ప్రేక్షణ వివరించారు. పిల్లలతో పాటు వారికి కలుపు ఎలా తియాలో నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, కౌముది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొలిరోజు నాలుగు నామినేషన్లు

### కేంద్రాలను పరిశీలంచిన అదనపు కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ స్వీకరణ తొలి రోజు బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ముగ్గురు కాంగ్రెస్, ఒకరు బీఎస్పీ పార్టీ అభ్యర్థి నామినేషన్లు వేశారు. భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల నామినేషన్ల స్వీకరణకు ఎంపీడీఓ, ఐకెపి కార్యాలయంలో రెండు నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆరుగురు రిటర్నింగ్ అధికారులను నియమించారు. తొలిరోజు నామినేషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు. నామినేషన్ కేంద్రాలలో సీసీటీవీల ఏర్పాటుతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కేంద్రంలో ప్రత్యేకంగా నామినేషన్ పత్రాల కౌంటర్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమీషనర్ గోపి గంగాధర్, ఎంపీడీఓ సంతోష్‌కుమార్‌లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



## మీడియా సెంటర్ ప్రారంభించిన కలెక్టర్

ప్రజాపక్షం/మెదక్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను అదనపు ఎస్పీ మహేందర్, అదనపు కలెక్టర్ నగేష్‌లతో కలసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారంపై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఆర్ ఓ బాబు రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లుల దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే మాట్లాడుతూ, వనదేవతలను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, కోరిన కోరికలు తీరుస్తూ ప్రజల కష్టాలను నెరవేరుస్తున్న గిరిజన ఆదివాసీ దైవం సమ్మక్క సారలమ్మ అని అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో జరిగే అన్ని మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్, సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సరుకులు అందజేత



ప్రజాపక్షం/కాళేశ్వరం : మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలోని ఎస్టీ కాలనీలో మబ్బు పోశక్క అనే మహిళ మృతి చెందగా బుధవారం మృతురాలి 3 వరోజు కార్యక్రమంలో భాగంగా ఆ నిరుపేద కుటుంబ సభ్యులకు 9వ వార్డు సభ్యుడు సయ్యద్ ఇమ్రాన్ అండగా నిలిచి ఆ కార్యక్రమానికి అవసరమైన బియ్యం, నూనె, పప్పులు తదితర నిత్యావసర సరకులు అందజేసి తన ఉదారతను చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంగాయి సదువలి పాల్గొన్నారు.

## మొదటిరోజు మూడు నామినేషన్లు

ప్రజాపక్షం/భూపాలపల్లి : భూపాలపల్లిలో తొలిరోజు మూడు నామినేషన్ భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ లో భాగంగా 30 వార్డుల గాను తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. భూపాలపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కోసం పలు కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులు నామినేషన్లను స్వీకరించారు. మొదటిరోజు 3 నామినేషన్ లు దాఖలయింది. నేడు, రేపు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. చివరి రోజు రేపు నామినేషన్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

# సమ్మక్క సారలమ్మ మహా జాతర ప్రారంభం

ప్రజాపక్షం/ములుగు : అశేష భక్తజన సందోహం నడుమ ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ మహాజాతర బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యింది. జాతర తొలి రోజు ఆచారాల ప్రకారం కన్నెపల్లి నుండి సారలమ్మ దేవత గద్దెపైకి రాకతో మహా జాతర అంకురార్పన జరిగింది. బుధవారం ఉదయం 11.30గంటల నుండి 12గంటల మధ్య సమ్మక్క సారలమ్మ పూజారులు గద్దెల వద్దకు చేరుకొని పుట్టమన్నుతో గద్దెలను అలికి శుద్ధి చేశారు. ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం గొట్టు గోత్రాల ప్రకారం ఆదివాసీ సాంప్రదాయ పద్ధతుల్లో పీఠ ముగ్గులు వేసి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర, సారెలను సమర్పించి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5గంటల నుండి 6గంటల సమయంలో కన్నెపల్లి నుండి హనుమంతుని రక్షా కవచంలో సారలమ్మ దేవత బయలు దేరి, రాత్రి 9గంటల నుండి 10గంటల మధ్య మేడారం గద్దెలకు చేరుకున్నారు. అదేవిధంగా కొండాయి నుండి గోవిందరాజులు, పూనుగొండ్ల నుండి పగిడిద్ద రాజులను పూజారులు మేడారం గద్దెలపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. మాఘ శుద్ధ పౌర్ణమి వెన్నెలలో సమ్మక్క అమ్మవార్లకు పగిడిద్ద రాజులకు ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మేడారం ప్రధాన పూజారి సిద్దబోయిన అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భక్తులందరూ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని, ప్రభుత్వం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు.

# చింతలగట్టు జాతర ప్రారంభం

ప్రజాపక్షం/గూడూరు : చింతలగట్టు వట్టేవాగు మినీ మేడారం జాతర పురస్కరించుకుని బుధవారం సమ్మక్క సారలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజు, నాగులమ్మ, జంపన్న గద్దెలపైకి ఆదివాసిలు సాంప్రదాయబద్ధంగా పూజారులు దారం సిద్ధు జాతర కమిటీ ఆధ్వర్యంలో మచ్చర్ల శివారు కోమురం భీమ్‌నగర్ నుంచి గోవిందరాజును జగన్నాయకులగూడెం నుంచి పగిడిద్దరాజు కొత్తగూడ మండలం గోపాలపేరం నుంచి నాగులమ్మను బయ్యారం మండలం గురిమిల్ల నుంచి జంపన్న మట్టేవాడ నండి సారలమ్మను దేవత తీసుకువచ్చి దేతల సామాగ్రిని తీసుకెళ్ళి డోలు దాయిద్యాలతో సారలమ్మ గుడికి చేర్చారు. ధూప నైవేధ్యాలు సమర్పించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని చింతలగట్టు వట్టేవాగు సమ్మక్కసారలమ్మ జాతర వైభవపేతంగా జరుపుకునే చింతలగట్టు వట్టేవాగు మీనీ మేడారం మహాజాతర బుధవారం భక్తజన ప్రవాహంతో అడవి ప్రాంతమంతా జనారణ్యంగా మారింది. మండలంలోని మచ్చర్ల శివారు వట్టేవాగు మినీ మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర కోయపూజారులైన దారం సిద్ధు జాతర కమిటీ అధ్యక్షుడు కారం లక్ష్మయ్య కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పగిడిద్దరాజు గద్దెకు చేరుకోగా సారలమ్మ బుధవారం రాత్రి గద్దెపై కొలువుదీరినారు. ఈమహాజాతర నాలుగు రోజులపాటు వైభవంగా జరుగుతుంది. జాతరకు మండలం నుండి కాకుండా బయ్యారం గార్ల కొత్తగూడ గంగారం తొర్రురు కేసముద్రం మహబూబాబాద్ జిల్లా తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు చేరుకోని తల్లులను దర్శనం చుసుకోంటారు. బుధవారం సారలమ్మ రాకతో భక్తులతో సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణమంతా జనంతో కిటకిటలాడింది. నిర్వాహకులు ఏర్పాటు చేశారు. జాతరలో అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చింతలగట్టు వట్టేవాగు జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతల కోసం పోలీసులు నిఘా పరిరక్షణలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ నాగ భవాని ఎప్పటికప్పుడు జాతర ప్రాంగణమంతా తిరుగుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాతర కమిటీ సలహాలు సూచనలు ఇస్తున్నారు.

**దారులన్నీ వట్టేవాగు జాతర వైపు**

**ట్రాఫిక్ నియంత్రణను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ గిరిధర్‌రెడ్డి**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల శివారు చింతగట్టు వట్టేవాగు జాతర రహదారున్నీ భక్తులతో నింగిపోయాయి మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తమ ప్రైవేట్ ప్రభుత్వ వాహనాల్లో జాతరకు చేరుకుంటున్నారు. అదేవిధంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కరి జరిగే ఈజాతర పెద్ద ఎత్తున భక్తుల రాకతో చింతగట్టు వట్టేవాగు జాతర సందడి వాతావరణం నెలకుంది అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి సైతం ఈ జాతరకు భక్తులు వస్తుండగా అధికారులు పెద్ద ఎత్తున సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈసందర్భంగా తాహసిల్దార్ నాగభవాని వట్టేవాగు జాతర వివరాలను ఎప్పట్పిడు అధికారుల నుండి తెలుసుకోని పర్యవేక్షిస్తున్నారు,

# ప్రశాంతంగా జాతర నిర్వహించుకోవాలి

### వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత



ప్రజాపక్షం/కమలాపూర్ : సమ్మక్క సారలమ్మ జాతరలో మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డిసిపి ధారా కవిత ప్రజలకు సూచించారు. కమలాపూర్, కన్నూరు, మర్రిపల్లి గూడెం, మాధన్నపేట గ్రామాలలో జరుగు సమ్మక్క సారలమ్మ జాతరలో పోలీస్ వారు ప్రజలు పాటించవలసిన విషయాలను వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి ఆయా గ్రామాలలోని సమ్మక్క సారలమ్మ జాతర జరుగు స్థలాలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఇందులో ముఖ్యంగా కన్నూర్ గ్రామంలో జరుగు సమ్మక్క సారలమ్మ జాతరకు జమ్మికుంట వైపు నుండి వచ్చు గ్రామాలు అయిన మడిపల్లి, మల్యాల, సిరిసేడు, కనగర్తి, లక్ష్మాజిపల్లి, రామన్నపల్లి, గుండేడు మీదుగా వచ్చు భక్తులు, ఇతర గ్రామాల నుండి వచ్చు భక్తులు ఎవరైనా కన్నూరు గ్రామం వద్ద గల కమాన్ వద్ద నుండి ప్రవేశించి దర్శనం అనంతరం కొత్తపల్లి గ్రామం వైపుగా బయటికి వెళ్ళవలసిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. జాతర కమిటీ పాలకవర్గం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తూ పోలీసులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో కమలాపూర్ సిఐ నవీన్, ఎస్ఐలు మధు, దిలీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల జిల్లా మారలేదు

ప్రజాపక్షం/కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ కేసముద్రం మండలం పెనుగొండ శివారు కట్టుగూడెం ప్రాథమిక పాఠశాల నేమ్‌బోర్డులో వరంగల్ జిల్లా




గానే దర్శనమిస్తుంది. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు కనీసం పాఠశాల నేమ్‌బోర్డులో జిల్లా మహబూబాబాద్ ఉండాలన్న ఆలోచన లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా బుధవారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రాకపోవడంతో సిఆర్‌పి విధులు నిర్వహించారు.

## బిఆర్ఎస్ హయాంలోనే భూపాలపల్లి సమగ్రాభివృద్ధి

### డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



ప్రజాపక్షం/భూపాలపల్లి : బిఆర్ఎస్ హయాంలోనే భూపాలపల్లి అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 26 నెలల కాంగ్రెస్ పాలనలో భూపాలపల్లి అభివృద్ధి పూర్తిగా శూన్యమైందన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని రోజుకో మంత్రి వచ్చి మున్సిపాలిటీ వందకు పైగా శిలాఫలకాలు వేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావాహులు అధిక సంఖ్యలో ముందుకు వస్తుండడంతో ఓర్వలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 50 శాతం మందికే రైతుబంధు ఇచ్చి మిగిలిన రైతులను మోసం చేసిందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండాను భూపాలపల్లిలో ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, బడితెల సమ్మయ్య, మేకల సంపత్ కుమార్ యాదవ్, పూర్ణచందర్, మాడ హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి ఘన వీడ్కోలు



ప్రజాపక్షం/వేలేరు : వేలేరు మండలకేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య ఆధ్వర్యంలో అభినందన వీడుకోలు సమావేశాను నిర్వహించారు. పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమ్మెట వీరయ్య ఈనెల పదవీవిరమణ పొందుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయ బృందంతో పాటుగా విద్యార్థులు బంధు మిత్రులు వీరయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిల్ల యాదగిరి, పూర్వ ప్రధానోపాధ్యాయులు గౌరిశెట్టి రాజన్న,సెయింట్ పీటర్స్ పాఠశాల అధినేత నారాయణరెడ్డి పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ అధికారిగా బొడ్డు ప్రసాద్



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ జిల్లా గీసుగొండ మండల కమ్యూనిటీ హెల్త్ అధికారిగా బొడ్డు ప్రసాద్ పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా, ఎస్సి, ఎస్టీ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉండి డిపార్ట్మెంట్ లో అన్ని క్యాడర్‌ల సమస్యలను సమన్వయ పరుస్తూ అధికారులకు, ఉద్యోగులకు వారిదిగా ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. హెల్త్ ఆఫీసర్ల క్షేమ సౌకర్యాలను మెరుగుపరుచుతూ, అనేక కార్యక్రమాలు, సామాజిక ఉద్యమాలు చేపడుతూ గీసుకొండ మండలం హెల్త్ అధికారిగా మరింత సేవ చేసేందుకు ప్రజలకు ఎల్లప్పుడూ శ్రద్ధ వహించి ముందుకు ఉంటానని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఆయనకు పలువురు అధికారులు బి. నెహ్రూ చంద్, వేణు గోపాల్, హనము నాయక్, సాంబయ్య, రమేష్, శ్రీనివాస్, కమలాకర్, ప్రకాష్ రెడ్డి అభినందనలు తెలిపారు.